క్లుప్తంగా

చోరీ కేసులో ఒకరి అరెస్టు

కేసముద్రం: మండలంలోని అమీనాపురం గ్రామంలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. అమీనాపురం గ్రామానికి చెందిన కల్లెం పుల్లయ్య ఇంట్లో, ఈనెల 22న రూ.51వేలు అపహరణకు గురైన విషయం తెలిసిందే. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో అమీనాపురంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా కనిపించిన ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సాయికుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అతడి వద్ద ఉన్న రూ.41వేలను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా ప్యాకెట్లు స్వాధీనం

గూడూరు: రూట్‌వాచ్ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై నాటుసారా రవాణా చేస్తున్న ఓ వ్యక్తి పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్. భిక్షపతి తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని చిన్న ఎల్లాపురం శివారు హేముతండా, గుంజేడు రోడ్డు మార్గంలో శనివారం తనిఖీ నిర్వహించామన్నారు. ఖానాపురం మండలం నాజీతండాకు చెందిన బానోత్ రాజేష్ ద్విచక్ర వాహనం ఆపి సోదా చేయగా బ్యాగ్‌లో నాటుసారా ప్యాకెట్లు లభించాయని, అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ భిక్షపతి తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికుడి మృతి

గార్ల: మండలంలోని బుద్దారంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న మేకల వెంకయ్య(58) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. పంచాయతీ కార్యదర్శి భూక్యా రాజేందర్, సర్పంచ్ భూక్యా కమిలి దహన సంస్కారాలకు రూ.10వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతదేహాన్ని గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండ్ల అప్పిరెడ్డి, సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు.

క్షుద్రపూజల కలకలం

దంతాలపల్లి: మండలం బీరిశెట్టి గూడెం గ్రామంలో శనివారం గంజి శ్రీనివాస్ రెడ్డి ఇంటి ఎదుట గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి నిమ్మకాయలు, కొబ్బరి కాయ, పసుపు, కుంకుమ తదితర వస్తువులు పెట్టి వెళ్లారు. గ్రామంలో ఇలాంటివి తరుచుగా జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు చర్య తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బహుమతుల ప్రదానం

దంతాలపల్లి: మండల కేంద్రంలో జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి వాణిశ్రీ, ద్వితీయ బి.కీర్తి, తృతీయ టి.అక్షయకు ఎస్సై రమేష్‌బాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేణుమాధవ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: నవంబర్ ఒకటో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు జరిగే అమరవీరుల సంస్మరణ సభల వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి హలావత్ లింగన్న పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్యతతో ఉద్యమాలు నిర్మించాలన్నారు. సమావేశంలో పార్టీ సబ్ డివిజన్ కార్యదర్శి బాబన్న, నాయకులు పాపయ్య, వెంకటనారాయణ, ఉపేందర్, హన్మంతు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

యుద్ధాన్ని ఖండించాలి

నెహ్రూసెంటర్: పశ్చిమ దేశాల అండదండలతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. సంఘ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ సభ శనివారం నిర్వహించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, నాయకులు రాజమౌళి, నాగన్న, సుధాకర్, దుర్గారావు పాల్గొన్నారు.

రూ.లక్ష ఆర్థికసాయం



కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన నిరుపేద అయిన యువత యూత్ క్లబ్ మాజీ అధ్యక్షుడు కోమాకుల రమేష్ కూతురి వివాహానికిగాను, యువత యూత్ క్లబ్, గ్రామ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో రూ.1,00,116ల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అరిగె విజేందర్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు నూకల వెంకటేశ్వర్లు, ఉప్పలయ్య, వెంకన్న, పాపాయ్య, శ్రీనివాస్, రాజేందర్‌గౌడ్, సంపత్, షబ్బీర్, రాకేష్ పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా భాస్కర్



తొర్రూరు రూరల్: మాదిగ లాయర్ల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని గుర్తురు గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది జెల్ల భాస్కర్‌ను నియమించారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయాలి

● డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్

చిన్నగూడూరు: డోర్నకల్ నియోజకవర్గ ప్రజలు రానున్న ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ఓటు వేయాలని డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని ఉగ్గంపల్లిలో రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉగ్గంపల్లి గ్రామంతో పాటు మంచ్యాతండా, దేవోజీతండా, ధూమ్దాతండాల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సంక్షేమ పథకాలతోపాటు అధికారంలోకి రాగానే కొత్త పథకాలు అమలు చేస్తామని తెలిపారు. ఓట్ల కోసం మాయ మాటలు చెప్పే వారిని నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంసింగ్, రైతు బంధు సమన్వయ సమితి కోఆర్డినేటర్ మంగపతిరావు, ఆయూబ్‌పాషా, ఉగ్గంపల్లి సర్పంచ్ పూలమ్మ, ఎంపీటీసీ ఉదయమ్మ పాల్గొన్నారు.



చిన్నగూడూరు: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

రెడ్యానాయక్ గెలుపు కోసం పూజలు

నర్సింహులపేట: డోర్నకల్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్ గెలుపు కోసం శనివారం మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బీఆర్‌ఎస్ నాయకులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొల్లం రమేష్, నర్సింహులపేట అధ్యక్షుడు జగదీశ్వర్, ఉప సర్పంచ్ నాగన్న, ఎండి.మధార్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదు

డోర్నకల్: రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలను ఓట్లు అడిగే హక్కు లేదని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న అన్నారు. స్థానిక బాపూజీనగర్‌లోని మందులవాడలో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు ఓటేసి గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోటిలింగం, వార్డు కౌన్సిలర్ శరత్, నాయకులు వెంకట్, బిక్షం, సుమన్, రాజబాబు పాల్గొన్నారు.

బీఎస్పీ అధికారంలోకి వస్తేనే న్యాయం

మహబూబాబాద్ అర్బన్: బీఎస్పీ అధికారంలోకి వస్తేనే మైనార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయం జరుగుతుందని పార్టీ మహబూబాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ గుగులోత్ శేఖర్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం అసెంబ్లీ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి కాంగ్రెస్, టీడీపీ బీఆర్‌ఎస్ లాంటి దొరల పార్టీలకు ఓట్లు వేయటం ద్వారా 93శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కులను అవకాశాలను కోల్పోతున్నారన్నారు. ఇప్పుడు బహుజనుల పార్టీ బీఎస్పీ మీ ముందుకు వచ్చిందని, ఏనుగు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ దార ప్రసాద్ రావు, జిల్లా అధ్యక్షుడు ఇస్లాంపల్లి ఉపేందర్, అసెంబ్లీ అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు రేవంత్ నాయక్, అసెంబ్లీ కార్యదర్శి సీత సాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శేఖర్ నాయక్

'శంకర్‌నాయక్ గెలుపు ఖాయం'



మాట్లాడుతున్న జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి

నెల్లికుదురు: జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన ప్రజా ఆశీర్వాద భహిరంగ సభతో నియోజక వర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు శంకర్ నాయక్ మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమైనట్లేనని జెడ్పీటీసీ సభ్యుడు మేకపోతుల శ్రీనివాసరెడ్డి తెలిపాడు. స్థానిక బీఆర్‌ఎస్ కార్యాయంలో శనివారం ఆయన మాట్లాడారు. ఈనెల 29 నుంచి బానోతు శంకర్ నాయక్ ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరిరెడ్డి, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ విజయం ఖాయం

కేసముద్రం: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం ఖాయమని ఎంపీపీ వోలం చంద్రమోహన్, మండల అధ్యక్షుడు ఎండి.నజీర్‌అహ్మద్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. మహబూబాబాద్‌లో జరిగిన సీఎం కేసీఆర్ ఆశీర్వాదసభకు అత్యధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారని, సభను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇనుగుర్తి ఎన్నికల ఇన్‌చార్జ్ జాటోత్ హరీష్‌నాయక్, సర్పంచ్ దార్ల రామ్మూర్తి, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ దికొండ వెంకన్న, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, నీలం దుర్గేష్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సట్ల వెంకన్న పాల్గొన్నారు.

వైభవంగా మహా సుదర్శన హోమం

మహబూబాబాద్ రూరల్: పౌర్ణమి సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి వారి దేవాలయంలో శనివారం మహాసుదర్శన హోమం పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై లక్ష్మీనారాయణచార్యులు ఆధ్వర్యంలో సహ అర్చకులు సుదర్శన హోమం జరిపారు. సుమారు వెయ్యి మందికిపైగా భక్తుల గోత్రనామాలపై సుదర్శన భగవానుడి సన్నిధిలో అర్చన పూజ చేశారు. చంద్ర గ్రహణం సందర్భంగా ఆలయాన్ని మధ్యాహ్నం మూసివేశారు. ఆదివారం ఉదయం ప్రత్యేక సంప్రోక్షణ అనంతరం భక్తులకు దైవదర్శనం ప్రారంభం అవుతుందని అర్చకులు తెలిపారు. అదే విధంగా జిల్లా కేంద్రంలోని నర్సంపేట రోడ్డులోగల శ్రీమహాగాయత్రీ దేవాలయంలో ప్రధాన అర్చకులు జలేంద్రాచార్యులు ఆధ్వర్యంలో సుదర్శన, గాయత్రీ హోమాలు జరిపి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

'సభకు తీసుకెళ్లి డబ్బులు ఇవ్వలేదు'



డబ్బులు ఇవ్వకపోవడంతో ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చిన వార్డు మహిళలు

మహబూబాబాద్: ఈనెల 27న జిల్లా కేంద్రం శివారు శనిగపురం రోడ్డులో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు తీసుకెళ్లి డబ్బులు ఇవ్వలేదని మానుకోట మున్సిపల్ పరిధిలోని 25వ వార్డుకు చెందిన పలువురు మహిళలు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాస గృహానికి శనివారం వచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులు వారితో మాట్లాడి డబ్బులు ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు. ఈసందర్భంగా శైలజ, మనెమ్మ, పర్వీన్, కళావతి మాట్లాడుతూ.. సభకు వస్తే రూ.200 నుంచి రూ.250 ఇస్తామని వార్డు కౌన్సిలర్ ఫరీదాబేగం, ఆమె భర్త సభకు తీసుకెళ్లారన్నారు. డబ్బుల కోసం వెళ్లగా మీరు సభకు రాలేదని డబ్బులు ఇవ్వనన్నారు. చేతిలో బియ్యం పట్టుకుని ప్రమాణం చేయాలని లేదా గుడిలోనైనా ప్రమాణం చేయాలని ఇబ్బంది పెట్టారన్నారు. సభకు వెళ్లిన 30 మంది పేర్ల జాబితో పలువురు మహిళలు ఎమ్మెల్యే నివాస గృహానికి వచ్చారు.

ఆమనగల్‌లో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇంటి వద్ద బాధిత కుటుంబం



మంటల్లో కాలిపోయిన నగదు

● అగ్నికి ఆహుతైన రూ.1.50లక్షల నగదు, ఇంటి సామగ్రి

మహబూబాబాద్ రూరల్: మండలంలోని ఆమనగల్ గ్రామానికి చెందిన పర్షబోయిన యాదగిరి ఇల్లు శుక్రవారం అర్ధరాత్రి అగ్నికి ఆహుతైంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పర్షబోయిన యాదగిరి కుటుంబ సభ్యులు ఇంట్లో ఉన్న కట్టెల పొయ్యి ఆర్పకుండా అలాగే నిద్రించారు. రాత్రి పొయ్యిలో నుంచి నిప్పురవ్వలు చెలరేగి ఒక్కసారిగా ఇంట్లో మంటలు వ్యాపించాయి. ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వడంతో వాహనం వచ్చి మంటలు ఆర్పింది. ఇంట్లోని ఇనుపబాక్సులో దాచి ఉంచిన రూ.1.50 లక్షల నగదు, ఇంటి సామాగ్రి పూర్తిగా కాలిపోయాయి. దీంతో రూ. 3లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. నిరుపేద కుటుంబానికి చెందిన యాదగిరిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

విద్యార్థులందరికీ అల్పాహారం అందేనా?

డోర్నకల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం పథకం నామమాత్రంగా ప్రారంభమైంది. డోర్నకల్ జీపీఎస్, కన్నెగుండ్ల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో మాత్రమే రెండు రోజులుగా విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. మండలంలో ఆరు జెడ్పీహెచ్‌ఎస్, ఆరు యూపీఎస్, 38 ప్రాథమిక పాఠశాలల్లో 3,545 మంది విద్యార్థులు ప్రతీరోజూ మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. వీరందరికీ ఉదయం వేళ అల్పాహారం అందించాల్సి ఉండగా రెండు మినహా మిగతా పాఠశాలల్లో ప్రారంభం కాలేదు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులే తమ డబ్బు వెచ్చించి అల్పాహారం అందించాల్సి ఉండగా తమకు మధ్యాహ్న భోజన బిల్లులు సక్రమంగా రాకపోవడంతో అప్పులపాలయ్యామని, తాము అల్పాహారం అందించలేమని చెబుతున్నారు. డోర్నకల్ జీపీఎస్, కన్నెగుండ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లలో ప్రధానోపాధ్యాయులే డబ్బు వెచ్చించి విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. మిగతా పాఠశాలల్లో ఉదయం వేళ విద్యార్థులకు మూడు రోజులు రాగిజావ, మూడు రోజులు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు పంపిణీ చేస్తున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలన్నింటిలో విద్యార్థులకు అల్పాహారం అందేలా చర్యలు తీసుకోవాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

కాషాయ జెండా ఎగరడం ఖాయం

నర్సింహులపేట: డోర్నకల్ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని డోర్నకల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య సంగీత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొదటగా నర్సింహులపేటలో ఇంటింట ప్రచారం చేశారు. ఎవరెన్ని కుట్రలు పన్నిన బీజేపీ గెలవడం ఖాయం అన్నారు.

బడే నాగజ్యోతి గెలుపు కోసం పూజలు

గంగారం: మండలంలోని కోమట్లగూడెం గ్రామంలో ములుగు బీఆర్‌ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతిని గెలిపించాలని గ్రామదేవతల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇర్ప సూరయ్య, గ్రామ అధ్యక్షుడు దుర్గం రాములు, కృష్ణమాచారీ, వెంకన్న, సమ్మయ్య పాల్గొన్నారు.

టికెట్ రావాలని పూజలు

మరిపెడ: డోర్నకల్ అసెంబ్లీ కాంగ్రెస్ టికెట్ రావాలని కిసాన్ పరివార్ అధినేత నెనావత్ భూపాల్‌నాయక్ అభిమానులు మరిపెడలోని మాకుల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకన్న, వెంకటేశ్వర్లు, జ్యోతి, స్వాతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ మహబూబాబాద్ నియోజకవర్గ అభ్యర్థిగా భూక్య మురళీనాయక్ పేరును ప్రకటించిన నేపథ్యంలో శనివారం పార్టీ శ్రేణులు ఘనంగా సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో 17వ వార్డు అధ్యక్షుడు వాంకుడోతు బాలాజీ నాయక్, ఉపాధ్యక్షుడు ముత్యం వెంకన్న, ప్రధాన కార్యదర్శి రాందాస్, బద్రునాయక్, కోశాధికారి చిరంజీవి, శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు యాకూబ్ పాషా, పట్టణ ఓబీసీ అధ్యక్షుడు వీరభద్రం పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి

గూడూరు: సీఎం కేసీఆర్‌ను మళ్లీ గెలిపిస్తే ప్రతీ ఒక్కరికీ అభివృద్ధి ఫలాలు అందుతాయని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ముక్కా లక్ష్మణ్‌రావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం వారు మాట్లాడారు. మానుకోటలో సీఎం సభను విజయవంతం చేసిన అన్ని వర్గాల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్, కతార్‌సింగ్, నర్సింహానాయక్, కోడి రవి పాల్గొన్నారు.

ఉర్సు మహోత్సవం



మహబూబాబాద్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామంలో ముస్లింలు హజ్రత్ మహబూబ్ సుభాని దర్గా10వ ఉర్సును అత్యంత భక్తి శ్రద్ధలతో శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ ఫరీద్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ముస్లిం మత పెద్దలు, కందిల్ కమిటీ సభ్యులు షేక్ యూసుఫ్, మస్తాన్, లతీఫ్ పాల్గొన్నారు.

కోతుల నివారణకు చర్యలు



పెద్దవంగర: పంటలను కోతులు నాశనం చేస్తుడండంతో రైతులు నష్టపోతున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, మండల ఇన్‌చార్జ్ ఎర్రబెల్లి గోపాల్‌రావు అన్నారు. మండలంలోని పోచంపల్లి గ్రామంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు సాకారంతో శనివారం కోతుల బెడద నివారణకు చర్యలు చేట్టారు. కార్యక్రమంలో బొమ్మకల్లు ఎంపీటీసీ రవీందర్ నాయక్, శ్రీరాం సుధీర్, సల్దెండి సుధాకర్, కమలాకర్ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

కేసముద్రం: ఎన్నికల కోడ్‌తోపాటు, పలుశాఖల అధికారులు ఎన్నికల విధుల్లో ఉన్న సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీపీ వోలం చంద్రమోహన్ తెలిపారు.

నవంబర్ 3న కొమురం భీం వర్ధంతి

గూడూరు: మండల కేంద్రంలో నవంబర్ 3వ తేదీన జరిగే కొమురం భీం వర్ధంతిని విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు లింగాల కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమానికి ఆదివాసులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

చులకనగా మాట్లాడడం సిగ్గుచేటు



కురవి: లంబాడీల పట్ల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చులకనగా మాట్లాడడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్ నాయకుడు గుగులోత్ రవినాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. జాతి కోసం అనేక పోరాటాలు చేసిన బెల్లయ్యనాయక్‌కు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేసిన సందర్భంగా రేవంత్‌రెడ్డి అనుచితంగా మాట్లాడినట్లు ఆరోపించారు. కార్యక్రమంలో బోజ్యానాయక్, వీరన్న, శ్రీనునాయక్, యుగేందర్, కిరణ్, మిట్టునాయక్, సుమన్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు అనుమతి నిరాకరణ

గార్ల: 32 ఏళ్లుగా జాంకీరాజు మెమోరియల్ ఆధ్వర్యంలో మర్రిగూడెం మిని స్టేడియంలో అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలు కొనసాగుతున్నా, ఈ ఏడాది దేవాలయం ఈఓ నందనం కవిత కబడ్డీ పోటీలకు అనుమతి నిరాకరించారని బంజార యువజన సేవా సంఘం మాజీ అధ్యక్షుడు భూక్యా హరినాయక్ శనివారం ఆరోపించారు. ఇట్టి విషయంపై దేవాలయం ఈఓ నందనం కవితను 'సాక్షి' వివరణ కోరగా కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని, ఎలాంటి లెటర్ ఇవ్వలేదని తెలిపారు.

పొంగులేటి జన్మదిన వేడుకలు

గార్ల: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం గార్లలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు జాటోత్ ఝాన్సీలక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామారావు, వెంకట్‌రెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

● ఎమ్మెల్యే సీతక్క

గంగారం: పదేళ్ల అధికారంలోకి వచ్చిన తెలంగాణ ప్రభుత్వంతో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని, మళ్లీ ఎన్నికలు రాగానే మాయ మాటలు చెప్పేందుకు అధికార పార్టీ నాయకులు గ్రామాల్లో తిరుగుతున్నారని, ప్రజలు నమ్మొదని ఏఐసీసీ జాతీయ మహిళా కార్యదర్శి, ములుగు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క)అన్నారు. గంగారం, కొత్తగూడ మండలాల నుంచి బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 25 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బానోత్ రూప్‌సింగ్, జిల్లా నాయకులు లావణ్య, వెంకన్న, వైస్ ఎంపీపీ కాబోయిన జంపయ్య, సర్పంచ్ మల్లెల రణదీర్, ఉపేంద్రచారీ, వల్లెపు రంజిత్ పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీతక్క

బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి

● బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి హుస్సేన్‌నాయక్

గూడూరు: బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే అభ్యర్థి జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని చెంద్రుగూడెం, పలు వీధుల్లో పల్లెపల్లెకు బీజేపీ, ఇంటింటికీ హుస్సేన్‌నాయక్ ప్రజాఆశీర్వాద యాత్ర శనివారం 50వ రోజు కొనసాగింది. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ఓటు వేయమని అభ్యర్థించారు. ప్రధాని నరేంద్రమోదీ అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఇంటింటికీ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్, రాంబాబునాయక్, కిరణ్‌గౌడ్, నాగరాజు, రమేష్, మల్లయ్యగౌడ్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న హుస్సేన్‌నాయక్

పుష్‌పుల్ రైలును కొనసాగించాలి



నిరసన తెలుపుతున్న డోర్నకల్ వాసులు

డోర్నకల్: ఖాజీపేట-డోర్నకల్, డోర్నకల్-విజయవాడ పుష్‌పుల్ రైలును రద్దు చేయకుండా కొనసాగించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఖాజీపేట, విజయవాడ మధ్య నడిచే పుష్‌పుల్ రైలు పేద, మధ్యతరగతి ప్రజలతో పాటు కూలీలు, ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. ప్రతీ రోజూ వందల సంఖ్యలో ప్రజలు ఖమ్మం, విజయవాడ, మహబూబాబాద్, వరంగల్ ప్రాంతాలకు ప్రయాణిస్తున్నారు. పుష్‌పుల్ రైలు సేవలను ప్రజలు వినియోగించుకుంటున్న తరుణంలో ఈ నెల 30 నుంచి రైలును రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెక్‌పోస్ట్ వద్ద సీసీ కెమెరాల నిఘా

కేసముద్రం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండల కేంద్రంలోని కోరుకొండపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఇటీవల చెక్ పోస్టును ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కాగా చెక్‌పోస్ట్ వద్ద మరింత నిఘా పెంచడం కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.



చెట్టుపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

కేంద్ర బలగాల కవాతు



దంతాలపల్లి: మండల కేంద్రంలో శనివారం స్థానిక పోలీసులతో కలసి కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈసందర్భంగా తొర్రూరు టౌన్ సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతమైన వాతవరణంలో నిర్వహించేందకు ప్రభుత్వం అనేక రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యాక్రమంలో ఎస్సై రమేష్‌బాబు, కేంద్ర బలగాలు, పోలీసులు పాల్గొన్నారు.

బయ్యారం: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మండలంలోని బయ్యారం, కొత్తపేట-గంధంపల్లిలో శనివారం సీఆర్‌పీఎఫ్ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. బయ్యారం, గార్ల ఎస్సైలు ఉపేందర్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.